Place your advertisements on website
https://rajadhanivartalu.com
call us at whatsapp
94406 62699

# రాజధాని వార్తలు
RAJADHANIVARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్దతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు
rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 6 సంచిక (Issue) : 355 పేజీలు (Pages) : 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)
బుధవారం, 11 - 6 - 2025
94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

# ప్రధాని మోదీకి మల్లికార్జున ఖర్గే సంచలన లేఖ



**ఢిల్లీ:** భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇవాళ (మంగళవారం) లేఖ రాశారు. లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ పదవి ఖాళీపై ప్రధానికి లేఖ రాశారు. లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ నియామకం ఆలస్యమవుతుండటంపై లేఖలో ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 93 ప్రకారం డిప్యూటీ స్పీకర్ ఎన్నిక తప్పనిసరి అని తెలిపారు మల్లికార్జున ఖర్గే. స్పీకర్ తర్వాత లోక్‌సభలో రెండో అత్యున్నత స్థానం డిప్యూటీ స్పీకర్‌దేనని మల్లికార్జున ఖర్గే గుర్తుచేశారు. ప్రతి కొత్త లోక్‌సభ రెండో లేక మూడో సెషన్‌లో డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకోవడం సంప్రదాయమని ఉద్ఘాటించారు. మొదటి నుంచి పదహారో లోక్‌సభ వరకు అన్ని లోక్‌సభల్లో డిప్యూటీ స్పీకర్ ఉన్నారని వివరించారు. కానీ 17వ, 18వ లోక్‌సభల్లో ఆ పదవి ఖాళీగా ఉందని చెప్పుకొచ్చారు మల్లికార్జున ఖర్గే. ఇది ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ప్రధాన ప్రతిపక్షానికి డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వడం సంప్రదాయమని చెప్పారు. ఈ స్థానం ఖాళీగా ఉండటం రాజ్యాంగ ఉల్లంఘన అని తెలిపారు. వెంటనే డిప్యూటీ స్పీకర్ ఎన్నిక ప్రక్రియ ప్రారంభించాలంటూ ప్రధాని మోదీకి మల్లికార్జున ఖర్గే విజ్ఞప్తి చేశారు.

# అనంతపురం జిల్లా ఘటనపై చంద్రబాబు సీరియస్




**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆడబిడ్డలపై చేయి వేయాలంటే భయపడే పరిస్థితిని రాష్ట్రంలో తీసుకు రావాలని పోలీస్ ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని రామగిరి మండలంలో ఎనిమిదో తరగతి బాలికపై సామూహిక లైంగిక దాడి ఘట నపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఈ ఘటనలో నిందితులను వెంటనే అరెస్ట్ చేసి..వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంగళవారం అమరావతిలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో చోటు చేసుకున్న ఘటనలపై ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక యువతి హత్య, మరో బాలికపై సామూహిక అత్యాచారం కేసును వేగంగా విచారణ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పక్కా ఆధారాల సేకరణతో నిర్దిష్ట సమయంలో నిందితులకు శిక్ష పడేలా చూడాలని అధికారులకు ఆయన సూచించారు. పోలీసులకు పూర్తి స్వేచ్ఛను ఇస్తున్నానన్నారు. గంజాయి బ్యాచ్ ఆట కట్టించాలని స్పష్టం చేశారు. ఇక ఈ రెండు ఘటనల్లో దర్యాప్తు, చర్యల వివరాలను సీఎం చంద్రబాబుకు ఈ సందర్భంగా డీజీపీ, ఉన్నతాధికారులు వివరించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రామగిరి మండలంలో ఎనిమిదో తరగతి చదువుతోన్న దళిత బాలికపై గత రెండేళ్లుగా అత్యాచారం జరుగుతోంది. ఈ ఘటనలో యువకుల నుంచి 60 ఏళ్ల వృద్ధుల వరకు ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటన చాలా ఆల స్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో ఆరుగురు నిందితులను మంగళవారం అచ్చంపల్లి వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఏడుగురు నిందితులు పరారీలో ఉన్నారు. వారిని సైతం అరెస్ట్ చేస్తామని శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రత్న వెల్లడించారు. బాధితు రాలిని వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలించామన్నారు. అలాగే బాధితురాలికి పూర్తి భద్రత కల్పించామని స్పష్టం చేశారు.

# కలిసికట్టుగా యోగా డేను విజయవంతం చేద్దాం : మంత్రి లోకేష్




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ వేదికగా జూన్ 21న జరుగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. యోగా దినోత్సవ వేడుకలపై ఈరోజు (మంగళవారం) మంత్రుల బృందం సమీక్ష నిర్వహించింది. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో బీచ్ రోడ్‌లోని సాగరిక హాలులో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యోగా డేకు సంబంధించి మంత్రి లోకేష్ పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ప్రపంచం మనవైపు చూసేలా యోగా దినోత్సవ వేడుకలను నిర్వహించాలన్నారు. అం దరూ కలిసికట్టుగా పని చేసి విజయవంతం చేయాలని లోకేష్ పిలుపునిచ్చారు. ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా పక్కా ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు. సూరత్‌లో జరిగిన ఈవెంట్‌ను స్టడీ చేసి.. పటిష్ట చర్యలు చేపట్టాలని తెలిపారు. ఇదొక చారిత్రక కార్యక్రమమని.. కమిట్‌మెంట్‌తో ప్రతీ ఒక్కరూ పని చేయాలన్నారు. బాధ్యతగా వ్యవహరించాలని మంత్రి హితవు పలికారు. ఇది ప్రభుత్వ కార్యక్రమం కాదని... ప్రజల వేడుక, అందరూ స్వచ్ఛందంగా భాగస్వామ్యమై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అన్ని రాజకీయ పార్టీలు కలిసి రావాలన్నారు. ప్రజల మానసిక, శారీరక ఆరోగ్యానికి సంబంధించిన క్రతువు ఇది అని చెప్పుకొచ్చారు. ప్రజలు 600 మీటర్ల కన్నా ఎక్కువ దూరం నడవకూడదని.. ఆ మేరకు వాహన సదుపాయం కల్పించాలని అన్నారు. జియో, ఎయిర్ టెల్ నెట్‌వర్క్ కెపాసిటీ పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు అన్ని రకాల వసతులు కల్పించాలని.. ప్రణాళికాయుతంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి లోకేష్ ఆదేశాలు చేశారు. ఇక.. ఇంటర్నేషనల్ యోగా డే సందర్భంగా నెలరోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర 2025 మాసోత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీరోజు ప్రజలు యోగాసానాలు చేస్తున్నారు. యోగాంధ్రకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా ప్రతీ ఒక్కరూ యోగాసనాలు వేస్తున్నారు. యోగాను ప్రోత్సహించేందుకు విజయవాడలోని బీఆర్టీఎస్ రోడ్‌ను యోగా రోడ్‌గా మార్చేశారు. అక్కడ ప్రతీ రోజు యోగా నిర్వహించేందుకు వీలు కల్పించింది సర్కార్. ఇక రాజకీయ నాయకులు, పోలీసులు, అధికారులు, యువత, చిన్నారులు, వృద్ధులు అందరూ కూడా యోగాంధ్రలో భాగంగా యోగాసాలు వేస్తున్నారు. జూన్ 21న విశాఖలో జరిగే అంతర్జాతీయ యోగా వేడుకల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారు.

# ఆలయాల్లో ప్లాస్టిక్ నిషేధం.. ఆగస్టు 15 నుంచి సంపూర్ణంగా అమలు

## - దేవాదాయ శాఖ మంత్రి రామలింగారెడ్డి



**బెంగళూరు:** రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో ఆగస్టు 15 నుంచి ప్లాస్టిక్ కవర్ల నిషేధం సంపూర్ణంగా అమలు చేస్తామని దేవదాయ శాఖ మంత్రి రామలింగారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బెంగళూరులో మీడియాతో మాట్లాడిన మంత్రి.. ఆలయాలకు వచ్చే భక్తులు ఇకపై ఎటువంటి ప్లాస్టిక్ వస్తువులను ఉపయోగించరాదన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మూడు నెలల్లో 1,253 ఆలయాలకు సంబంధించి 11,322 ఆస్తులను గుర్తించామన్నారు. ఇతర రాష్ట్రాల్లో కర్ణాటక భక్తులకోసం వసతి గృహాలను నిర్మించాలని భావిస్తున్నామన్నారు. తిరుపతి గాంధీ రోడ్డులో వసతి గృహాలను నిర్మిస్తున్నామన్నారు. అర్చకుల పిల్లలకు స్కాలర్‌షిప్ సౌలభ్యాన్ని అమలు చేస్తున్నామన్నారు. 249 మంది విద్యార్థులకు ప్రోత్సాహక వేతనం ఇచ్చామన్నారు. మృతి చెందిన ఏడుగురు అర్చకుల కుటుంబీకులకు రూ.14 లక్షలు పరిహారం ఇచ్చామన్నారు.

# శ్రీసత్యసాయి జిల్లాలో దారుణం




**పుట్టపర్తి, (రాజధాని వార్తలు):** శ్రీసత్యసాయి జిల్లాలోని రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని రామగిరి మండలంలో అమానవీయ ఘటన చోటు చేసుకొంది. దళిత బాలికపై గత రెండేళ్లుగా అత్యాచారం చేస్తున్న ఘటన చాలా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాలికపై అత్యాచారానికి పాల్పడిన వారిలో ఆరుగురు వ్యక్తులను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. మరో ఏడుగురు నిందితులు పరారీలో ఉన్నారు. అయితే ఈ అత్యాచారానికి పాల్పడిన నిందితుల్లో మైనర్ల నుంచి 50 ఏళ్ల పైబడిన వ్యక్తులు వరకు ఉన్నట్లు తెలుస్తోంది.

**ఇంతకీ ఏం జరిగిందంటే..**

ఏడుగుర్రాలపల్లెకు చెందిన ఎనిమిదో తరగతి చదువుతోన్న దళిత బాలికపై గత రెండేళ్లుగా అత్యాచారం జరుగుతోంది. ఆ క్రమంలో ఆ బాలిక తల్లిదండ్రులు.. పంచాయతీ కోసం గ్రామ పెద్దల వద్దకు వెళ్లారు. దీంతో వారు సైతం ఆ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. దీంతో రెండుసార్లు ఆ బాలికకు అబార్షన్ సైతం చేయించారు. ఆ తర్వాత ఆ బాలిక కుటుంబాన్ని గుట్టుచప్పుడు కాకుండా కొండ గుట్టల్లో దాచారు. ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో ఈ ఘటనపై రామగిరి పోలీసులు ఆరా తీశారు. అనంతరం దళిత బాలిక కుటుంబం జాడ కనిపెట్టి.. అనంతపురంలోని సత్య కేంద్రానికి వారిని తరలించారు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ రత్న వెల్లడించారు. నిందితులపై ఫోక్సో యాక్ట్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటితో పాటు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఈ కేసులో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశామని.. మరో ఏడుగురు నిందితులు పరారీలో ఉన్నారని చెప్పారు. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ రత్న వివరించారు. ఇక ఈ అత్యాచార ఘటనను నిందితులు వీడియో సైతం తీశారని తెలిపారు. బాధితురాలుకు వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలించామన్నారు. బాలికకు పూర్తి స్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ రోజు అచ్చంపల్లి వద్ద నిందితులు తలారి మురళి, పడగొల్లు నందవర్ధన్, నాగరాజు, సంజీవ, రాజన్న, రంగన్నలను అరెస్ట్ చేశా మన్నారు. అనంతరం వీరిని రిమాండ్‌కు తరలిస్తున్నామని తెలిపారు. మిగిలిన నిందితులను సైతం సాధ్యమైనంత త్వరగా అరెస్ట్ చేస్తామని జిల్లా ఎస్పీ రత్న తెలిపారు. ఈ ఘటనపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. నిందితులను పట్టుకొని వారిని కఠినంగా శిక్షించాలని అధికారులను ఆదేశించారు.

# మోదీ పాలనపై పురందేశ్వరి ఆసక్తికర వ్యాఖ్యలు



**విజయవాడ, (రాజధాని వార్తలు):** ఎన్డీఏ కూటమికి ప్రజలు మంచి విజయాన్ని అందించారని బీజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి వ్యాఖ్యానించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భారతదేశానికి సుపరిపాలన, ధృడమైన నాయకత్వంతో మంచి పాలన అందిస్తున్నారని ఉద్ఘాటించారు. వికసిత్ భారత్ కేవలం అభివృద్ధి చెందిన భారత దేశమే కాదు ప్రతి సామాజికవర్గం ఎదుగుదల సాధించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు పురందేశ్వరి. ఇవాళ (మంగళవారం) విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో పురందేశ్వరి మీడియాతో మాట్లాడారు. మోదీ నాయకత్వంలో దేశాన్ని పాలించగల సత్తా ఉందని ప్రజలు భావించి బీజేపీకి భారీ విజయాన్ని అందించారని చెప్పారు. సబ్ కా వికాస్, సబ్ కా ప్రయాస్, సబ్ కా విశ్వాస్‌తో అన్ని లక్ష్యాలని ఛేదించాలనే ఉద్దేశంతో మోదీ పాలన కొనసాగిస్తున్నారని వివరించారు. దేశంలో అవినీతిరహిత పాలన ఉండాలని ప్రజలు భావించి బీజేపీని గెలిపిస్తున్నారని చెప్పుకొచ్చారు పురందేశ్వరి. ఆంధ్రరాష్ట్రంలో గత జగన్ ప్రభుత్వం రాక్షస పాలనతో ప్రజలని ఇబ్బందులకి గురి చేశారని పురందేశ్వరి మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏపీలో అధికారంలోకి వచ్చాక అభివృద్ధి దిశలో పాలన కొనసాగుతోందని అన్నారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలు అందించటం అలాగే రాజధాని నిర్మాణం కోసం నిధులు కేటాయించారని పురందేశ్వరి పేర్కొన్నారు.

# కొమ్మినేని శ్రీనివాస్‌కు రిమాండ్

**గుంటూరు, (రాజధాని వార్తలు):** ఏపీ మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన కేసులో సాక్షి ఛానల్ యాంకర్ కొమ్మినేని శ్రీనివాస్‌కు బిగ్ షాక్ తగిలింది. కొమ్మినేనికి రిమాండ్ విధిస్తూ మంగళగిరి కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈరోజు ఉదయం (మంగళవారం) కొమ్మినేనిని పోలీసులు మంగళగిరి కోర్టులో హాజరుపర్చగా.. వాదనలు జరిగాయి. అనంతరం ఆయనకు 14 రోజుల పాటు రిమాండ్ విధించింది కోర్టు. దీంతో కొమ్మినేని శ్రీనివాస్‌ను గుంటూరు జిల్లా జైలుకు పోలీసులు తరలించనున్నారు. అమరావతి మహిళలు, అమరావతి ప్రాంతంపై అసభ్యకరమైన వ్యాఖ్యలతో సాక్షి ఛానల్‌లో నిర్వహించిన డిబేట్‌పై రాజధాని ప్రాంతం మహిళలతో రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు నిరసన ర్యాలీలు చేపట్టారు. అనేక పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. అందులో భాగంగా తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో టీడీపీ మహిళా నాయకురాలు కంభంపాటి శిరీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిన్న ఉదయం హైదరాబాద్‌లో కొమ్మినేని శ్రీనివాస్‌ను ఆయన నివాసంలోనే అరెస్ట్ చేశారు.

అనంతరం గుంటూరుకు తరలించిన పోలీసులు.. రాత్రి నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో విచారణ జరిపారు. ఆపై ఈరోజు ఉదయం గుంటూరు జీజీహెచ్‌లో కొమ్మినేనికి వైద్య పరీక్షలు నిర్వహించిన తర్వాత మంగళగిరి కోర్టులో హాజరుపర్చారు. ఇరువర్గాల వాదనలు విన్న మంగళగిరి కోర్టు కొమ్మినేని శ్రీని వాస్‌కు 14 రోజుల పాటు రిమాండ్ విధించింది. రిమాండ్ అనంతరం అతడిని గుంటూరు జిల్లా జైలుకు తరలించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

# దేశంలో ఏ సీఎంకి రాని ఆలోచనలు ఎన్టీఆర్‌కు వచ్చాయి

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఎన్టీఆర్ కుటుంబంలో మూడో తరం లీడర్‌గా రాణిస్తున్న లోకేష్ బాబు, తెలంగాణలోనూ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారం చేపట్టడం ఖాయం. తెలుగు దేశం పార్టీకి ఎప్పటికీ రుణపడి వుంటాను. ఆస్ట్రేలియాలోని సిడ్నీలో నిర్వహించిన ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవంలో తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు, సర్వేపల్లి శాసనసభ్యులు సోమి రెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్ట్రేలియాలో ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చి ఇక్కడి తెలుగు ప్రజలను కలుసుకోవడం చాలా సంతోషంగా ఉంది. నందమూరి తారక రామారావు 302 సినిమాల్లో నటించారు. అందులో 270 సినిమాలు హిట్ 94 సినిమాలు 300 రోజులు ఆడగా, 185 సినిమాలు 175 రోజులు అలా ఆడాయి. 1962లో నెల్లూరులో మా కుటుంబ పెద్దలు శ్రీనివాస మహల్ థియేటర్‌ను ప్రారంభించారు. ఆ థియేటర్‌లో ఎన్టీఆర్ నటించిన వెంకటేశ్వర మహత్యం సినిమాను చూడటం ఇంకా గుర్తుంది.. ఇంకా అనేక సూపర్ హిట్ సినిమాలు చూశాము. 1983 నుంచి ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్నాను.



1991లో దూబగుంట రోశమ్మ సారథ్యంలో మొదలైన సారా వ్యతిరేక ఉద్యమానికి అఖిలపక్ష పోరాట కమిటీ కన్వీనర్‌గా వ్యవహరించాను. ఉమ్మడి ఏపీలోని అన్ని జిల్లాల్లో సారా వేలం పాటలు నిర్వహించగా, ఒక్క నెల్లూరు మాత్రం జరగ కుండా అడ్డుకున్నాము. అప్పట్లో ఎన్టీఆర్‌ను కలిసి ఉద్యమం గురించి వివరించాం. మా ఆహ్వానం మేరకు నెల్లూరుకు వచ్చిన ఆయన సంపూర్ణ మద్యపాన నిషేధం హామీ ఇచ్చారు. ఎన్టీఆర్ ఇచ్చిన ఆ హామీతో అప్రమత్తమైన అప్పటి కాంగ్రెస్ సీఎం కోట్ల విజయభాస్కర్ రెడ్డి రెండు నెలల్లోనే సారా నిషేధం అమలులోకి తెచ్చారు.

1994లో అధికారం చేపట్టగానే ఎన్టీఆర్ ఇచ్చిన మాట ప్రకారం సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేశారు. రాష్ట్రం ఆదాయం కోల్పోతుం దనే ఆందోళన ఉన్నా ఇచ్చిన మాటకు కట్టుబడ్డారు. 2019 ఎన్నికల సందర్భంగా వైసీపీకి ఓట్లు వేస్తే మద్యపాన నిషేధం చేస్తామని చెప్పిన జగన్ రెడ్డి ఆ మద్యంతోనే వ్యాపారం చేశాడు. సిట్ విచారణలో రూ.3200 కోట్ల కుంభకోణం జరిగిందని తేలింది.

అనధికారికంగా జరిగిన విక్రయాలను లెక్కిస్తే ఏపీ లిక్కర్ స్కాం రూ.10 వేల కోట్లకు పైగానే మద్యం స్కామ్ జరుగు తోందని నేను 2019 నుంచి ఏటా ప్రెస్ మీట్లు పెట్టి చెబుతూనే వచ్చాను.. ఈ రోజు సిట్ విచారణలో అదే తేలింది. నటుడిగా సినిమాల్లో అలుపెరగకుండా పనిచేసిన ఎన్టీఆర్ అధికారం చేపట్ట గానే పేదలకు పింఛన్ ఇవ్వాలని సంకల్పించారు. ఒక్క పింఛనే కాదు..మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, సింగిల్ విండో వ్యవస్థ, మండలాల ఏర్పాటు, రైతులకు హార్స్ పవర్ కరెంట్ రూ.50కే తదితర ఎన్నో పథకాలు, వ్యవస్థలను ఆవిష్కరించారు. తెలుగు గంగ ప్రాజెక్టుతో ఆ రోజుల్లోనే నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టారు. ఈ రోజు కృష్ణా జలాలు కర్నూలు, కడప, నెల్లూరు, చిత్తూరు ప్రజలతో పాటు చెన్నైకి తాగు నీరు ఇవ్వడం ఎన్టీఆర్ ఆలోచనలతోనే సాధ్యమైంది. దేశంలోనే ఏ ముఖ్యమంత్రికి రాని ఆలోచనలు ఎన్టీఆర్‌కు వచ్చాయి. ఆ రోజుల్లో విమానంలో ప్రయాణిస్తుంటే పేదల ఇళ్లు శ్లాబులతో కనిపిస్తే అది ఏపీ అని ఒక కేంద్ర మంత్రి చెప్పారంటే ఎన్టీఆర్ చేపట్టిన పక్కా ఇళ్ల నిర్మాణం పుణ్యమే రైతులకు 7 శాతం వడ్డీకే రుణాలు.. సకాలంలో చెల్లిస్తే 5 శాతమే వడ్డీ వంటి పథకాలు అందించారు ఎన్నో మంచి పనులు చేసిన మహానుభావుడు ఎన్టీఆర్ నాయక త్వంలో పనిచేసే అదృష్టం నాకు లభించింది. విజనరీ లీడర్ చంద్ర బాబు నాయుడు మంత్రివర్గాల్లో మూడు సార్లు మంత్రిగా వ్యవహ రించాము. నారా లోకేష్ బాబుతోనూ కలిసి మంత్రిగా పనిచేశా.. ఇప్పుడు వారితో కలిసి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నాము యువగళం పాదయాత్రతో లోకేష్ రాజకీయాల్లో కొత్త చరిత్ర సృష్టించి ఎన్టీఆర్ కుటుంబంలో మూడో తరం హీరోగా నిలిచారు. తెలంగాణలోనూ టీడీపీ - జనసేన- బీజేపీ కూటమి ఘనవిజయం సాధించి అధికారం చేపట్టడం ఖాయం అని అన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే సతీమణి బొజ్జల రిషిత రెడ్డి - బాలాజీ రెడ్డి జన్మదిన వేడుకలు





**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తి శాసనసభ్యులు, బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషిత రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కట్ చేసి రిషితా రెడ్డికి తినిపించి, టిడిపి మహిళా నేతలకు పంచి పెట్టారు. అనంతరం పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆమెను వారి నివాసంలో కలిసి దుశ్శావాలు, పుష్పగుచ్ఛాలతో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాతృమూర్తి బొజ్జల బృందమ్మ, టిడిపి నాయకులు విజయ్ కుమార్ కంటా రమేష్, చెంచయ్య నాయుడు, కాసరం రమేష్, గోపీ, ధనంజేయులు నాయుడు, తాటిపర్తి ఈశ్వర్ రెడ్డి, పాపిరెడ్డి, పాపిరెడ్డి, తొట్టంబేడు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రావిళ్ల మునిరాజా నాయుడు, కన్నలలి ప్రతాప్ రెడ్డి, మణి, తిరుపతి పార్లమెంట్ యువత అధికార ప్రతినిధి చెన్ను, రాఘవులు యాదవ్, తెలుగుదేశం పార్టీ నాయకులు, పర్చూరు వెంకటరమణ గౌడు, సుమతి, రేణుకా దేవి, మల్లీశ్వరి, కుమారి పాల్గొన్నారు.

అలాగే శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి, ఆయన సతీమణి బొజ్జల రిషితా రెడ్డిల ఆధ్వర్యంలో బొజ్జల అభిమాని తెలుగుదేశం నాయకులు బాలాజీ రెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

# రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపడమే చంద్రబాబు లక్ష్యం

## - కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపడమే చంద్రబాబు లక్ష్యమని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ను కావలి ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో సన్నీ వంశీ కృష్ణ, అధికారులతో కలిసి వీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2047వ సంవత్సరానికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్నటువంటి సందర్భంలో ఆంధ్రప్రదేశ్ ప్రగతి, ఆంధ్రప్రదేశ్ ఖ్యాతి ఆంధ్రప్రదేశ్ ప్రజల మౌలిక సదుపాయాలు, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ, ఆంధ్రప్రదేశ్ విద్యా విధానం, ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతి అన్నిటిని కలగలిపితే భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిపేదానికి భాగంగా ఈరోజున లాంచనంగా స్వర్ణాంధ్ర ఆంధ్రప్రదేశ్ 2047 ని లాంచనంగా ప్రారంభించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు తెలియజేస్తూ ఉన్నామని తెలిపారు. ప్రతి నియోజక వర్గంలో కూడా ఈరోజున ఒక డాక్యుమెంట్ రూపొందించి డాక్యుమెంట్‌లో దాదాపు 10 అంశాలు, 10 రకాలైనటువంటి పారామీటర్స్‌ని తీసుకొని భవిష్యత్తులో ఏ విధంగా ప్రతి డిపార్ట్మెంట్‌ని అభివృద్ధి చేస్తే 2047వ సంవత్సరానికి ఇది స్వర్ణాంధ్ర ప్రదేశగా ఏర్పడుతుంది, ఏ విధమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలి, ప్రజల ఆటిట్యూడ్‌ని ఎలా మార్చాలి, ప్రజల అవసరాలను ఎలా చూడాలి అన్నిటిని కూడా ఈరోజున కావలి ఆర్డిఓ ఆధ్వర్యంలో కావలి నియోజకవర్గంకు సంబంధించిన డాక్యుమెంట్‌ను తయారు చేస్తున్నందుకు ఈ సందర్భంగా వారిని, వారి టీమ్‌ని కూడా ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. భవిష్యత్తులో పారిశ్రామికవాడ ప్రగతికి, ఎయిర్పోర్ట్‌లకు, హార్బర్, రామాయపట్నం పోర్ట్ ఇలా అన్నిటిని అనుసంధానం చేసుకుంటూ ఇండస్ట్రీ, అగ్రికల్చర్, ఎడ్యుకేషన్ పరంగా కావలి ప్రగతి పథంలో ముందుకు పోవడానికి వాళ్ళు మంచి డాక్యుమెంట్ తయారు చేస్తారని, వారిని కూడా ప్రత్యేకంగా అభినందిస్తున్నానని తెలిపారు.

# గుడ్ మార్నింగ్ సూళ్లూరుపేట కార్యక్రమాన్ని ప్రారంభించిన నెలవల విజయశ్రీ

**సూళ్లూరుపేట, (రాజధాని వార్తలు):** సూళ్లూరుపేట నియోజక వర్గంలోని గాండ్ల వీధినందు సూళ్లూరుపేట నియోజకవర్గం శాసనసభ్యురాలు నెలవల విజయశ్రీ గుడ్ మార్నింగ్ సులూరుపేట కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా గాండ్ల వీధిలో పలుచోట్ల ఉదయం 7 గంటల నుండి 8 గంటల వరకు పర్యటించి ప్రజల వద్ద వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం గుడ్ మార్నింగ్ సూళ్లూరుపేట కార్యక్రమంలో సమస్యలను ప్రజల యొక్క సమస్యలను అర్థం చేసుకొని స్వయంగా తెలుసుకుని వారి సమస్యలను పరిష్కారం చేసే దాంట్లో భాగంగానే గుడ్ మార్నింగ్ సూళ్లూరుపేట కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని కార్యక్రమంలో వారు తెలియజేశారు. అదే కార్యక్రమంలో భాగంగా సూళ్లూరుపేట గాండ్ల వీధి ప్రజల సమస్యలను తెలుసుకొని సులూరుపేట మున్సిపల్ కమిషనర్ కే చిన్నయ్య దృష్టికి తీసుకుని వెళ్లి సమస్యను త్వరితగతిన పరిష్కరించవలసిందిగా వారికి తెలియజేశారు. అదేవిధంగా సూళ్లూరుపేటలో సిమెంట్ రోడ్లు విషయము అదేవిధంగా మురికి కాలువలు




విషయము పలు రకాలైనటువంటి వీధి దీపాలు సమస్యలు కూడా ప్రజలు వెలుగులోకి తీసుకు రావడంతో ఆ సమస్యలను పరిష్కరిస్తామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు ఆకుతో రమేష్ సులూరుపేట తెలుగుదేశం పార్టీ పట్టణ కార్యదర్శి ఏజీ కిషోర్ సుధాకర్ రెడ్డి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరిగింది.

# సాక్షిపై దాడి మీడియా గొంతునొక్కే ప్రయత్నమే : తిరుపతి ఎంపీ గురుమూర్తి




**తిరుపతి, (రాజధాని వార్తలు):** తిరుపతి సాక్షి కార్యాలయంపై కూటమి నాయకుల దాడి చేసిన విషయాన్ని తెలుసుకున్న తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి హుటాహుటిన రేణిగుంటలోని సాక్షి యూనిట్ కార్యాలయానికి చేరుకున్నారు. సాక్షి సిబ్బందిని దాడి జరిగిన తీరు గూర్చి తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు.సాక్షిపై దాడి మీడియా గొంతు నొక్కే ప్రయత్నమని అన్నారు.అయిదు సంవత్సరాల తమ ప్రభుత్వ హయాంలో కూటమి పార్టీలకి మద్దతు తెలిపే మీడియా వేదికగా తమ నాయకుడు వైఎస్ జగన్మోహన రెడ్డిని వారి సతీమణి వైఎస్ భారతిని అనరాని మాటలు మాట్లాడినా ఇలా ఏ రోజు కూడా భౌతిక దాడులకు పాల్పడిన సందర్భాలు లేవని ఎంపీ అన్నారు. రాష్ట్రంలో అదుపు తప్పిన శాంతి భద్రతలకు ఇదో ఉదాహరణగా అభివర్ణించారు. ఒక పత్రికలో వచ్చిన వార్తను ఊటంకిస్తూ విశ్లేషకుడు మాట్లాడిన మాటలను సాకుగా చూపుతూ, చర్చలో పాల్గొన్న ప్రముఖ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు క్షమాపణ తెలిపినా కూడా ఇలా సాక్షి సంస్థలపై దాడులు చేయడం మంచి పద్ధతి కాదని సూచించారు. రెడ్ బుక్ రాజ్యాంగం ఇప్పుడు జర్నలిస్ట్‌ల వరకు వచ్చిందని భవిష్యత్‌లో ఎలాంటి పరిణామాలకి దారి తీస్తుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని డైవర్షన్ పాలిటిక్స్ అన్ని రోజులు చెల్లవని కూటమి ప్రభుత్వానికి కూకటి వేళ్ళతో పెకలించే రోజు దగ్గరలోనే ఉందని హెచ్చరించారు.

# మోడీ నాయకత్వంలోనే జాతీయ భద్రత : మిడతల రమేష్



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మోడీ నాయకత్వంలో జాతీయ భద్రత ఉందని, బిజెపిలో మోడీ సైనికుడిగా పని చేస్తున్నందుకు గర్వంగా ఉంది. మోడీ 11 ఏళ్ల పాలనపై బీజేపీ నేత మిడతల రమేష్ ప్రధాని మోడీ 11 సంవత్సరాల పాలన వలన భారతదేశంలో పేదరికం గణనీయంగా తగ్గుముఖం పట్టింది అన్నారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ నాలుగు రోజుల క్రితం భారతదేశంలో తీవ్ర పేదరికం తగ్గుముఖం పట్టిందని ప్రకటించింది. 11 సంవత్సరాల క్రితం దేశంలో 22% తీవ్ర పేదరికం నేడు 5.5% తగ్గింది. ప్రపంచంలో నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించింది. దేశంలో విద్యుత్ సౌకర్యం లేని 18 వేల గ్రామాలకు విద్యుత్ సౌకర్యం మోడీ నాయకత్వంలోనే అందించడం సాధ్యమైంది. ఆపరే షన్ సింధూర్ ద్వారా భారత సైనిక శక్తిని ప్రపంచ దేశాలకు తెలిసి వచ్చింది. అన్ని రంగాలలో కేంద్ర బిజెపి ప్రభుత్వం మోడీ నాయకత్వంలో ముందుకు పోతుంటే రాహుల్ గాంధీ మాత్రం తల్లడిల్లి పోతున్నాడు. పాకిస్తాన్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని మన దేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతున్నాడు. ప్రపంచ దేశాలలో మోడీని హీరోలా చూస్తుంటే పాకిస్తాన్లో మాత్రం కాంగ్రెస్ యువజన యువరాజు రాహుల్ గాంధీని హీరోగా సామాజిక మాధ్యమాల్లో చూపిస్తున్నారు. 11 ఏళ్ల మోడీ నాయకత్వంలో బిజెపిలో మోడీ సైనికుడిగా పనిచేయడం ఈ జీవితానికి గర్వంగా ఉందని రమేష్ తెలిపారు.

# మూడవ రోజు తెప్పపై విహరించిన శ్రీ పద్మావతీ అమ్మవారు





**తిరుచానూరు, (రాజధాని వార్తలు):** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాల్లో భాగంగా మూడవరోజు సోమ వారం పద్మసరోవరంలో శ్రీ పద్మావతీ అమ్మవారు తెప్పపై మూడు చుట్లు విహరించి భక్తులను అనుగ్రహించారు. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన, నిత్యార్చన నిర్వహించారు.

మధ్యాహ్నం 03.00 నుండి 4.30 గంటల వరకు స్వామి వారికి వేడుకగా అభిషేకం నిర్వహించారు. ఇందులో భాగంగా పాలు, పెరుగు, తేనె, చందనం, సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు ఉత్సవమూర్తులను పద్మపుష్కరిణి వద్దకు వేంచేపు చేశారు. సాయం త్రం 6.30 నుండి రాత్రి 7.15 గంటల వరకు తెప్పోత్సవం వైభవం గా జరిగింది. అనంతరం శ్రీ పద్మావతీ అమ్మవారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు చలపతి ఇతర అధికారులు, ఆలయ అర్చకులు, శ్రీవారి సేవకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఫిట్‌నెస్‌కు మెయిన్ రీజన్ చెప్పిన మెగాస్టార్



టాలీవుడ్ స్టార్ హీరో మెగాస్టార్ చిరంజీవి ఏడు పదుల వయసులో కూడా కుర్ర హీరోలకు పోటీగా స్టెప్పులేసి అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. ఈ వయసులో కూడా చిరంజీవి అంతటి గ్రేస్‌తో డ్యాన్సులు వేయడాన్ని అందరూ మెచ్చుకుంటూ ఉంటారు. రాజకీయాల్లోకి వెళ్లినప్పుడు కాస్త లావైన చిరంజీవి తిరిగి సినిమాల్లోకి కంబ్యాక్ ఇచ్చాక బాగా బరువు తగ్గి ఫిట్ నెస్ విషయంలో అందరికీ ఓ ఎగ్జాంపుల్‌గా నిలిచారు. అలాంటి చిరంజీవి తను ఫిట్‌గా ఉండటానికి గల అతి పెద్ద సీక్రెట్‌ను బయటపెట్టారు. యోగా వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయన్న మెగాస్టార్ తన సోషల్ మీడియాలో యోగా ప్రాముఖ్యతను వివరిస్తూ ఓ పోస్ట్ చేశారు. యోగాను ప్రపంచానికి ఇండియా ఇచ్చిన గిఫ్ట్‌గా చిరంజీవి పేర్కొన్నారు. జూన్ 21న యోగా దినోత్సవాన్ని అందరూ కలిసి జరుపుకోవాలని ఆయన కోరారు. ఫోకస్ ద్వారా ఫిట్‌నెస్ పెరుగుతుందని, కానీ యోగా ఈ రెండింటినీ పెంచుతుందని, ఈ ఇయర్ ఇంటర్నేషనల్ యోగా డే ను అందరం కలిసి సెలబ్రేట్ చేసుకుందామని, ఇండియా ప్రపంచానికి యోగా రూపంలో ఓ గొప్ప బహుమతిని ఇచ్చిందని, బోర్డర్లను దాటి దాన్ని సెలబ్రేట్ చేసుకుందామని, శారీరక ధృఢత్వం, మానసిక ప్రశాంతత రెండింటినీ పెంపొందిచడంలో యోగా ఓ సమగ్రమైన మార్గమని చిరంజీవి ఈ సందర్భంగా చెప్పారు. యోగా మన ఆరోగ్యాన్ని సహజంగా మెరుగుపరచడంలో ఎంతో సాయపడుతుంది కాబట్టి మన ఫిట్‌నెస్‌ను మెరుగు పరచుకోవడానికి గొప్ప స్టార్ట్ అవుతుందని ఆయన చెప్పారు. కాగా చిరంజీవి ప్రస్తుతం డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో సినిమా చేస్తున్నారు. నయనతార హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాను సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేలా మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

# మెహ్రీన్ ఎలా అయ్యిందో చూడండి



నాని హీరోగా నటించిన కృష్ణ గాడి వీర ప్రేమ గాధ సినిమాతో హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ మెహ్రీన్. ఈ అమ్మడు మొదటి సినిమాలో అందంతో ఆకట్టుకోవడంతో పాటు జూనియర్ మిల్కీ బ్యూటీ అనే ట్యాగ్‌ను సొంతం చేసుకుంది. మిల్కీ బ్యూటీ తమన్నా రేంజ్‌లో ఈ అమ్మడికి టాలీవుడ్‌లో ఫ్యూచర్ ఉంటుందని అంతా భావించారు. కానీ అనూహ్యంగా ఆమెకు లక్ కలిసి రాలేదు. హీరోయిన్‌గా చేసిన సినిమాల్లో కొన్ని సూపర్ హిట్ అయ్యాయి. అయినా కూడా యంగ్ స్టార్ హీరోలకు జోడీగా ఈ అమ్మడికి నటించే అవకాశం దక్కలేదు. ఆ మధ్య వరుస సినిమాలు చేసిన మెహ్రీన్ ఈ మధ్య సినిమాలే చేయడం లేదు. చివరగా మెహ్రీన్ తెలుగులో 'ఎఫ్ 3' సినిమాలో కనిపించింది. ఎఫ్ 2 లో ఈమె చేసిన హనీ పాత్రకు మంచి స్పందన దక్కింది. అందుకే ఎఫ్ 3 లోనూ అదే పాత్రలో మెహ్రీన్‌ను దర్శకుడు అనిల్ రావిపూడి నటింపజేశాడు. ఎఫ్ 3 సినిమా ఆశించిన స్థాయిలో విజయాన్ని సొంతం చేసుకోలేదు. దానికి తోడు మెహ్రీన్ పాత్ర మరీ నాసిరకంగా ఉంది అంటూ విమర్శలు వచ్చాయి. అందుకే మెహ్రీన్ హీరోయిన్‌గా తెలుగులో ఆఫర్లు దక్కించుకోవడంలో విఫలం అవుతోంది. ప్రస్తుతం ఒక కన్నడ మూవీ తప్ప మరే సినిమాలను ఈ అమ్మడు చేయడం లేదు. త్వరలో తెలుగులో ఈమె సినిమాలు చేయాలని అభిమానులు బలంగా కోరుకుంటున్నారు. సినిమాలతో పెద్దగా సందడి చేయకున్నా హీరోయిన్‌గా ఆఫర్లు రాకున్నా కూడా సోషల్ మీడియాలో ఈమె అందాల ఆరబోత ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా ఈమె షేర్ చేసే అందాల స్కిన్ షో ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తూ ఉన్నాయి. మెహ్రీన్ హీరోయిన్‌గా వచ్చిన పాపులారిటీ కంటే ఆమె అందంగా కనిపిస్తూ షేర్ చేసిన ఫోటోల వల్ల వచ్చిన పాపులారిటీ ఎక్కువ అనే అభిప్రాయం సైతం కొందరు వ్యక్తం చేస్తూ ఉంటారు. ఆకట్టుకునే మెహ్రీన్ ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుందని మరోసారి నిరూపితం అయింది. అందంగా కనిపించడం మాత్రమే కాకుండా ఫోటోలకు అద్భుతమైన ఫోజ్‌లు ఇవ్వడం అనేది మెహ్రీన్‌కి మాత్రమే సాధ్యం అంటూ ఉంటారు. తాజాగా ఈ అమ్మడు రెడ్ టాప్ ధరించి విభిన్నమైన డిజైన్ తో ఉన్న పాయింట్‌ను ధరించింది. అంతే కాకుండా తలకు స్కార్ఫ్ కట్టుకుంది. నడుము అందం చూపిస్తూ ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోలు ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ మెహ్రీన్ సొంతం అంటూ ఉంటారు. ఈ ఫోటోలను చూస్తే ఖచ్చితంగా ఎవరైనా ఆ మాట అనాల్సిందే. మెహ్రీన్ ఇంతటి అందంను ఉంచుకుని సరిగ్గా సినిమాలను ఎంపిక చేసుకో వడం లేదు అంటూ కొందరు కామెంట్ చేస్తున్నారు. తెలుగులో రీ ఎంట్రీ ఇచ్చి ఇకపై అయినా వరుస సినిమాల్లో మెహ్రీన్ నటిస్తే బాగుండు అని చాలా మంది కోరుకుంటున్నారు. టాలీవుడ్‌లో మెహ్రీన్ రీ ఎంట్రీ సాధ్యమేనా అనేది చూడాలి.

# కూలి తెలుగు రైట్స్.. ఇది కాస్త రిస్కే



లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో రజనీకాంత్, నాగార్జున, ఉపేంద్ర, అమీర్ ఖాన్ వంటి స్టార్ హీరోలు కలిసి నటిస్తున్న క్రేజీ మల్టీస్టారర్ సినిమా కూలి. ఇప్పటికే ఫస్ట్ గ్లింప్స్‌తో భారీ అంచనాలు నెలకొల్పిన ఈ సినిమాపై నాలుగు భాషల అభిమానుల్లో బజ్ ఊపందుకుంది. లోకేష్ మార్క్ యాక్షన్, మాస్ వేరియేషన్‌కి రజనీ స్టైల్ కలగలిపితే ఎలా ఉంటుందో చూడాలని సినీప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సినిమాతో నాగార్జున చాలా రోజుల తర్వాత తమిళంలో మళ్లీ సందడి చేయబోతున్నాడు. ఇందులో ఆయన క్యారెక్టర్‌కు స్పెషల్ మాస్ షేడ్స్ ఉన్నట్లు టాక్. రజనీకి విలన్‌గా నటిస్తున్న నాగ్, కన్నడ హీరో ఉపేంద్ర పాత్రలు కూడా ఫ్యాన్స్‌కి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. కైది, విక్రమ్, లియో లాంటి సినిమాల తర్వాత లోకేష్ మల్టీ హీరో స్క్రిప్ట్ ఎలా డిజైన్ చేశాడనే క్యూరియాసిటీ ఇప్పటికే పీక్స్‌కి వెళ్లిపోయింది. ఇలా బజ్ ఉన్న ఈ సినిమాకు సంబంధించిన తెలుగు థియేట్రికల్ రైట్స్ కోసం టాలీవుడ్‌లో ఉన్న టాప్ డిస్ట్రిబ్యూటర్లు గట్టిగానే పోరాటం చేస్తున్నారు. దిల్ రాజు, ఆసియన్ సునీల్, సితార నాగవంశీ, అన్నపూర్ణ స్టూడియోస్ వంటి వారంతా ఈ రైట్స్‌ను సంపాదించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ పోటీని గమనించిన నిర్మాతలు ఆశతో, తెలుగు రాష్ట్రాల్లో మాత్రమే థియేటర్ల కోసం జీఎస్టీ మినహాయించి రూ. 45 కోట్లు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని సంస్థలు జీఎస్టీ మినహాయించి 36 కోట్లు, ఇంకొంతమంది జీఎస్టీతో కలిపి 43 కోట్లు వరకు ఆఫర్ చేసారని సమాచారం. కానీ నిర్మాతలు మాత్రం కనీసం జీఎస్టీ మినహాయించి 40 కోట్లకు పైగా ధర రావాలని ప్రయత్నిస్తున్నారు. ఇదే సమయంలో ఈ ఏడాది ఆగస్టు 14న ఎన్టీఆర్, హృతిక్ రోషన్ కాంబినేషన్‌లో వస్తున్న వార్ 2 కూడా రిలీజ్ కాబోతుండటంతో, ఈ రైట్స్ కొనడంలో కొంత రిస్క్ ఉన్నదని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. వార్ 2 ఒక పాన్ ఇండియా ఫుల్ యాక్షన్ ఎంటర్టైనర్ కావడం, ఎన్టీఆర్ బాలీవుడ్ ఎంట్రీ కావడం, హృతిక్ రోషన్ ఫ్యాన్ బేస్ ఉండడం వలన ఇలా అన్నీ కోణాల్లో తీవ్రమైన పోటీని కలిగిస్తాయి. రెండు నెలల ముందే వార్ 2 అడ్వాన్స్ బుకింగ్స్ కూడా మొదలవ్వడం, థియేటర్లు ముందుగానే బ్లాక్ అవ్వడం కూడా కూలీని బయ్యర్లకు తలనొప్పిగా మారుస్తోంది. కానీ గతంలో విక్రమ్, లియో లాంటి లోకేష్ సినిమాలు తెలుగులో మాస్ లాభాలు అందించడంతో ఆయనపై విశ్వాసం ఉందని ట్రేడ్ అంటోంది. జైలర్ సినిమా కూడా రజనీ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలవడంతో నిర్మాతలు అత్యధిక ధరను ఆశించడంలో తప్పేమీ లేదని చెబుతున్నారు. కానీ అదే సమయంలో ఇది రిస్కే అన్న వాస్తవాన్ని గమనించాల్సిందే. ఇప్పుడు ఈ బేరంలో ఎవరు గెలుస్తారో, ఎవరు నష్టపోతారో చూడాలి.

# సూర్య ఔట్.. మరో హీరోతో ప్రముఖ దర్శకుడు



సూర్య హీరోగా వెట్రిమారన్ దర్శకత్వంలో 'వాడివాసల్' అనే సినిమా రూపొందాల్సి ఉంది. చాలా కాలం క్రితమే వీరి కాంబో మూవీని అధికారికంగా ప్రకటించడం జరిగింది. జల్లికట్టు నేపథ్యంలో ఈ సినిమాను రూపొందించబోతున్నట్లుగా కూడా ప్రకటించారు. సినిమా నుంచి సూర్య ఫస్ట్ లుక్‌ను విడుదల చేయడం ద్వారా అందరిలోనూ ఆసక్తిని రేకెత్తించారు. వెట్రిమారన్ సినిమాలను ఇష్టపడే వారు ఆయన దర్శకత్వంలో సూర్య సినిమా అనగానే అంచనాలు పెంచేసుకున్నారు. విడుదల పార్ట్ 1, విడుదల పార్ట్ 2 సినిమాల తర్వాత సూర్యతో వెట్రిమారన్ సినిమా చేయాల్సి ఉంది. కానీ కంగువా సినిమా ఫలితమో లేదా మరేదైనా కారణమో కానీ ఆ సినిమా రద్దు అయింది అనే వార్తలు వస్తున్నాయి. వెట్రిమారన్ మొన్నటి వరకు వాడివాసల్ సినిమాను చేస్తాడని ఇండస్ట్రీ వర్గాల వారు సైతం అనుకున్నారు. కానీ అనూహ్యంగా ఆ సినిమాను పక్కన పెట్టి తమిళ హీరో శింబుతో సినిమాకు వెట్రిమారన్ రెడీ అయ్యాడు. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం ఇప్పటికే వీరి కాంబో మూవీ ప్రీ ప్రొడక్షన్ వర్క్ ప్రారంభం అయింది. సినిమా రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. అతి త్వరలోనే సినిమా గురించి అధికారిక ప్రకటన వస్తుందని తెలుస్తోంది. ఇప్పటికే సినిమాకు సంబంధించిన నటీ నటుల ఎంపిక జరుగుతుంది అనే వార్తలు సైతం తమిళ మీడియాలో వస్తున్నాయి. సూర్య బ్యాక్ టు బ్యాక్ కంగువా, రెట్రో సినిమాలతో నిరాశ పరిచిన నేపథ్యంలో తదుపరి సినిమా విషయమై చాలా అంచనాలు ఉన్నాయి. బాలాజీ దర్శకత్వంలో ఇప్పటికే సూర్య సినిమా చేస్తున్నాడు. ఆ సినిమా తర్వాత అయినా వెట్రిమారన్‌తో సినిమాను చేయవచ్చు. కానీ వెట్రిమారన్‌తో కాకుండా తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరితో సూర్య సినిమాకు రెడీ అయ్యాడు.

విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం సూర్య ఈ రెండు సినిమాల తర్వాత కూడా వెట్రిమారన్ దర్శకత్వంలో సినిమా చేయకపోవచ్చు. అందుకు గల కార ణాలు ఏంటి అనేది మాత్రం క్లారిటీ లేదు. సూర్య, వెట్రిమారన్ కాంబోను ఇష్టపడే వారికి ఇది నిరాశ కలిగించే విషయం. ఇక శింబు ఇటీవల బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో దుమ్ము లేపుతున్నాడు. తాజాగా కమల్ హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన థగ్ లైఫ్ సినిమాలో శింబు ముఖ్య పాత్రలో నటించాడు. ఆ సినిమా ఫలితం బెడిసికొట్టడంతో తదుపరి సినిమాపై ఆయన ఆశలు పెట్టుకున్నాడు. రామ్ కుమార్ బాలకృష్ణన్ దర్శకత్వంలో శింబు ప్రస్తుతం సినిమాను చేస్తున్నాడు. ఆ సినిమా కాకుండా శింబు కొత్తగా రెండు మూడు సినిమాలు కమిట్ అయ్యాడని, అందులో వెట్రిమారన్ దర్శకత్వంలో ఒక సినిమా అనే తెలుస్తోంది. వీరిద్దరి కాంబో కచ్చితంగా ఆకట్టుకునే విధంగా ఉంటుంది. అయితే శింబుతో తీయబోతున్న కథ గతంలో సూర్యతో అనుకున్నదేనా అనేది తెలియాల్సి ఉంది.

# "వస్త్ర అన్నదానంలో" జేసీఐ శ్రీకాకుళం మెయిన్

## - నెల రోజులు ఏకధాటి సేవలో జేసీఐ శ్రీకాకుళం మెయిన్
## - జేసీఐ వ్యవస్థాపకులు డా.జామి భీమశంకర్






**శ్రీకాకుళం, (రాజధాని వార్తలు):** జేసీఐ శ్రీకాకుళం మెయిన్ నెల రోజులు ఏకధాటి సేవలు కొనసాగిస్తుందని జేసీఐ శ్రీకాకుళం వ్యవస్థాపకులు డా.జామి భీమశంకర్ అన్నారు. స్థానిక నిరాశ్రయుల భవనం (నైట్ షెల్టర్)లో జేసీఐ శ్రీకాకుళం మెయిన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు అన్నప్రసాద వితరణతోపాటు, వస్త్రదానం చేశారు. ఇందులో భాగముగా పాల్గొన్న డా.జామి భీమశంకర్ మాట్లాడుతూ జేసీఐ శ్రీకాకుళం మెయిన్ గత పది రోజుల నుండి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని అధ్యక్షులు కూన. అనిల్ కుమార్, కార్యదర్శి తమ్మినేని ఉష రాణి, జోన్ కోఆర్డినేటర్ బెందాళం వరలక్ష్మి, ఇతర సభ్యుల సహకారంతో నెల రోజులపాటు నిరంతర సేవలు కొనసాగుతాయన్నారు. ప్రభుత్వం నిరుపేదలకు ఆశ్రయం కల్పిస్తుందని, ఇందులో భాగముగా నగరానికి చెందిన చేయూత మేమున్నాం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు వైశ్యరాజు. వెంకటలక్ష్మికు నైట్ షెల్టర్ బాధ్యతలను ప్రభుత్వం అప్పజెప్పిందని, ఆ బాధ్యతకు వైశ్యరాజు వెంకటలక్ష్మి అర్హురాలన్నారు. అనంతరం నిస్సహాయులకు వస్త్రాలు, అన్నప్రసాద వితరణ చేపట్టి కార్యదర్శి తమ్మినేని ఉష రాణి, ప్రముఖ వైద్యులు డా.పైడి సింధూర ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో చేయూత మేమున్నాం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు వైశ్యరాజు వెంకటలక్ష్మి మాట్లాడుతూ నైట్ షెల్టర్‌లో నిరుపేదలకే కాకుండా అనుకోకుండా దూర ప్రయాణాలు చేసి, రాత్రి సమయాలలో ఇక్కడ ఆశ్రయం పొందవచ్చన్నారు.

అలాగే మా మీద నమ్మకంతో నైట్ షెల్టర్ బాధ్యతను అప్పజెప్పిన మెప్మా, మున్సిపల్ కమీషనర్ ఇతర అధికారులకు ధన్యవాదాలని, అన్ని స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యులను భాగం చేస్తూ, సేవకులు ఉర్లం. శివతేజ, చేయూత మేమున్నాం సభ్యుల బృందంతో కలసి నైట్ షెల్టర్‌కు పూర్వవైభవం తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జేసీఐ శ్రీకాకుళం మెయిన్ సభ్యులు డా.చింతాడ కృష్ణ మోహన్, మండవల్లి రవి, జగదీశ్, నారాయణ, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# త్రాగునీటి సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తాం : బుజ్జి బాబు

## - కొమ్మంగి గ్రామ పర్యటనలో బుజ్జి బాబు - సమస్యలపై శాఖలతో చర్చించి శీఘ్ర పరిష్కారం హామీ





**అల్లూరి జిల్లా, చింతపల్లి, (రాజధాని వార్తలు):** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం కొమ్మంగి గ్రామ పంచాయతీ కేంద్రంలో గసరి దిలీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి జనసేన పార్టీ చింతపల్లి మండల అధ్యక్షుడు వంతల బుజ్జి బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేనను విజయ పథంలో నడిపించేందుకు పార్టీ బలోపేతం, కార్యకర్తల ఐక్యతను మరింతగా పెంపొందించాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. ప్రత్యేకంగా మారుమూల గిరిజన ప్రాంతాల్లో పార్టీ కార్యక్రమాలను విస్తరించాలని సూచించారు. ప్రతి బడుగు, బలహీన వర్గ ప్రజలకు జనసేన పార్టీ అండగా ఉంటుంది. గ్రామాభివృద్ధి, ప్రజాప్రయోజనాలే మాకు ముఖ్య లక్ష్యాలు అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో జరిగిన పరస్పర సంభాషణలో బుజ్జి బాబు, కొమ్మంగి గ్రామంలో త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉందని తెలుసుకున్నాను. ప్రస్తుతం పైపులైన్ ద్వారా నుయ్యి నుంచి నీరు తరలించబడుతున్నా, సరైన సరఫరా జరగడం లేదు. సంబంధిత శాఖ అధికారులతో చర్చించి త్వరితగతిన సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాను, అని హామీ ఇచ్చారు. అనంతరం వైసీపీ పార్టీ వార్డు నంబర్ కార్యకర్త నాగెలి వెంకటరావు తన అనుయాయులతో కలిసి జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీ నిధులను వెనక్కి తీసుకుని, సర్పంచులను భిక్షాటనకు గురిచేసిన దుస్థితిని చూశాం. పవన్ కళ్యాణ్ నాయకత్వం, అభివృద్ధి కార్యక్రమాలను చూసి జనసేన సిద్ధాంతాల పట్ల నమ్మకంతో పార్టీలో చేరుతున్నాం అన్నారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ మండల కోఆర్డినేటర్ వంతల రాజుబాబు, సీనియర్ నాయకులు కారేగి మచ్చెరాజు, పాంగి సుబ్బారావు, కొర్ర బాలాజీ, పాంగి కృష్ణ, గుంట చంటి, గుంట కోటి, సిందేరి సురేష్ తదితరులు పాల్గొన్నారు. స్థానికంగా గ్రామస్తులు మద్దెల కోటేశ్వరరావు, లక్కే ఈశ్వరరావు, నూకరాజు, కవిత, కాంతమ్మ, చిన్నమ్మి, విరమ్మ, రామ్, సాయి కుమార్, రాజా, సతీష్, కోటి బాబు తదితరులు హాజరయ్యారు.

# సతీష్ శిష్యులకు ప్రతి ఒక్కరికి మెమొంటో అందజేత







**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని శారద ఒడ్డిన శాంతి పార్క్‌లో అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ మరియు నరిశే చిరంజీవి ఆధ్వర్యంలో అనకాపల్లి నియోజకవర్గంలో యోగా గురువు పుల్లెట్ సతీష్, జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించిన చిన్నారులు అనకాపల్లి పేరు ప్రత్యేకతను పెంచిన సతీష్ శిష్యులకు ప్రతి ఒక్కరికి మెమొంటో అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథిగా అనకాపల్లి పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు డాక్టర్ కాంద్రేగుల నారాయణరావు చేతుల మీదగా చిన్న చిరు సత్కారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మళ్ళ భాస్కర్, మాజీ ఎస్ఐ గోపాలరావు, నటభూషణ్ శోభన్‌బాబు సేవా సమితి చైర్మన్ ముగడ అప్పారావు, బాబ్జి మాస్టర్, దాడి జగన్, పలకా కాసులు, దాడి శ్రీను, లాయర్ పట్నాయక్ మరియు అబ్దుల్ కలాం సేవా సంఘం సభ్యులు, యోగ టీం సభ్యులు, శాంతి పార్క్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు విస్తరణలో ఇండ్లు కోల్పోయిన బాధితులకు 8 సంవత్సరాలు గడిచిన అందని నష్టపరిహారం



**ఎన్టీఆర్ జిల్లా, మైలవరం, (రాజధాని వార్తలు):** మైలవరం టు నూజివీడు రోడ్డు విస్తరణలో చంద్రాల గ్రామంలో సుమారు 65 మందికి ఇల్లు వారి స్థలాలను కోల్పోయినారు. 2016-17 సంవత్సరంలో ఈ రోడ్డు విస్తరణ జరిగింది, నాటి నుండి నేటి వరకు బాధితులకు సుమారు 6 కోట్ల 75 లక్షల రూపాయలు నష్టపరిహారం చెల్లించవలసి ఉంది. నేటి వరకు నష్టపరహారం అందకపోవటంతో నేడు స్థానిక ఎమ్మార్వో కార్యాలయం వద్ద సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కార్యాలయం ముట్టడికి ప్రయత్నించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి ఆంజనేయులు సిపిఎం మండల కార్యదర్శి సిహెచ్ సుధాకర్ మాట్లాడుతూ మండల రెవెన్యూ మరియు జిల్లా అధికారుల నిర్లక్ష్యం మూలంగా చంద్రాల గ్రామానికి చెందిన బాధితులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు అన్నారు. ఈ రోడ్డు విస్తరణ జరిగిన తర్వాత అనేక మంది కలెక్టర్లు మండల రెవెన్యూ అధికారులు మారారని అయినా కూడా బాధితులకు న్యాయం జరగలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి తిరిగి ఇబ్బందులు పడటం మూలంగానే రెవెన్యూ కార్యాలయం ముట్టడికి ప్రయత్నించవలసిన పరిస్థితి వచ్చిందని వారు అన్నారు. నాడు మంత్రిగా ఉన్న ఉమామహేశ్వరావు కానీ నేడు ఎమ్మెల్యే కాని ఒక్క ప్రజాప్రతినిధి కూడా స్పందించకపోవడం దుర్మార్గం అని అన్నారు. ఎన్నికల సమయంలో తప్ప ప్రజల కష్టాల సమయంలో పట్టించుకోని ప్రజాప్రతినిధులు ఎందుకు అని ప్రశ్నించారు. రెండు గంటలపాటు నిరసన కొనసాగించగా ఎమ్మార్వో కలెక్టర్ మీటింగ్లో ఉన్నానని 15 రోజులు గడువు కావాలని 15 రోజుల్లో డబ్బులు పడే విధంగా తగిన చర్యలు తీసుకుంటానని, కార్యాలయంలో ఉన్న డిప్యూటీ తాసిల్దార్ని మరియు ఆర్ & బి అధికారులను పంపించి హామీ ఇవ్వడంతో కార్యక్రమాన్ని విరమించినారు. 15 రోజుల్లో సమస్య పరిష్కరించకుంటే తమ గ్రామంలో రాస్తారోకో దిగుతాం గ్రామ ప్రజలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు వజ్రాల వెంకట్ రెడ్డి, చంద్రాల గ్రామ బాధితులు శివప్రసాద్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు






**ఎన్టీఆర్ జిల్లా, మైలవరం, (రాజధాని వార్తలు):** ఎన్టీఆర్ జిల్లా, మైలవరం మండలం, మైలవరంలోని స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు నటసింహ, నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు యువత అధ్యక్షుడు లంక లితీష్, టిడిపి శ్రేణులు ఆధ్వర్యంలో భారీ కేక్ కటింగ్ ఏర్పాటు చేసి, మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, తెలుగు యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జ్యేష్ఠ పౌర్ణమి పర్వదినం - పాకలపాటి గురువు గారి ఆశ్రమంలో వేడుకలు

## - గిరిజన సమాజానికి మార్గదర్శకులైన గురుదేవుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రత్యేక పూజలు



**అల్లూరి జిల్లా, చింతపల్లి, (రాజధాని వార్తలు):** గిరిజనుల ఆరాధ్య దైవంగా భావించే, శ్రీ శ్రీ శ్రీ ధామరాజు వేంకటరామ యోగేశ్వరుల (పాకలపాటి గురువు) జన్మదినం రేపు (బుధవారం) జరగనుంది. ఈ సందర్భంగా, జ్యాష్ఠ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని, చింతపల్లి మండలంలోని లోతుగెడ్డ జంక్షన్ సమీపంలోని కృష్ణాపురం గ్రామంలో ఉన్న బాబు ఆశ్రమంలో పూజాకార్యక్రమాలు నిర్వహించనున్నాయి. గురుభక్తులు, గురుబంధువులు ఈ పూజలో పాల్గొని, గురుదేవుల తీర్థ ప్రసాదాలను స్వీకరించేందుకు ఆహ్వానించబడుతున్నారు. ఈ వేడుకలు యావన్నికి ఓ దైవిక అనుగ్రహాన్ని ప్రసాదించేవిగా ఉంటాయని, గురుదేవుల సమర్పణతో అనుగ్రహాలు పొందగలుగుతామని ప్రార్థన చేస్తున్నారు. ఈ వేడుకలకు సంబంధించి రామానంద యతీశ్వరులు మరియు గురుభక్తులు పిలుపునిచ్చారు. గురుదేవుల ఆశీస్సులతో ఈ కార్యక్రమం సజావుగా జరుగుతుందని వారు తెలియజేశారు.

# గ్రామీణ బ్యాంకుల విలీనం - 'చైతన్య గోదావరి ఖాతాదారుల పాలిట శాపం' : నిమ్మరాజు చలపతిరావు




**(రాజధాని వార్తలు):** ఎంకి పెళ్లి సుబ్బి చావుకి వచ్చిన చందంగా ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ బ్యాంకుల విలీనం చైతన్య గ్రామీణ బ్యాంకుకు చెందిన దాదాపు 25 లక్షల మంది ఖాతాదారుల పాలిట శాపంగా మారింది. వాస్తవానికి ఈ విలీనం వల్ల ఆ బ్యాంకు ఉద్యోగులకు వచ్చిన నష్టమేమీ లేదు. కొద్ది రోజుల క్రితం రాష్ట్రంలోని చైతన్య గోదావరి, ఆంధ్ర ప్రగతి, ఆంధ్ర గ్రామీణ వికాస్, సప్తగిరి ఈ నాలుగు గ్రామీణ బ్యాంకులు ఏపి గ్రామీణ బ్యాంకుగా అవతరించాయి. విలీనం రోజు వరకు ఒక్క చైతన్య గోదావరిలోనే అత్యధిక వడ్డీ రేటు ఉండేది. ఇతర జాతీయ గ్రామీణ బ్యాంకుల కంటే కూడా అధికంగా సీనియర్ సిటిజన్స్‌కు 8.6 శాతం సాధారణంగా 8.1 శాతం ఏడాది కాల డిపాజిట్ పై ఉండేది. విస్తృత ప్రచారం వల్ల డిపాజిట్లు కూడా దాదాపు రూ 13 వేల కోట్లకు చేరాయి. ఇతర గ్రామీణ బ్యాంకులలో తక్కువ వడ్డీ ఉందంటూ వాటితో సమానంగా అదీ ఎలాంటి ప్రచారం లేకుండా గుట్టు చప్పుడు కాకుండా అర్ధ శాతం తగ్గించి సీనియర్ సిటిజన్స్‌కు 8.1 శాతం సాధారణం గా 7.6 శాతం వడ్డీని అమలు చేయటం ప్రారంభించారు. దీనివల్ల పాత చైతన్య గోదావరి బ్యాంకుకు చెందిన డిపాజిట్‌దారులు ఒక లక్ష రూపాయలకు ఏడాది కాలానికి కనీసం రూ. 500 నష్టపోతున్నారు. బ్యాంకుల జాతీయకరణ తరువాత జాతీయ బ్యాంకులు పల్లె వాసులకు అందుబాటులో ఉండాలన్న నాటి ప్రధాని దివంగత శ్రీమతి ఇందిరా గాంధీ లక్ష్యంతో దేశంలో గ్రామీణ బ్యాంకుల వ్యవస్థ ఏర్పడింది. రాష్ట్రంలో తొలిగా 1983లో తెనాలి కేంద్రంగా నాటి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి నాదెండ్ల భాస్కరరావు చైతన్య గ్రామీణ బ్యాంకును ప్రారంభించగా అక్కడ ఆంధ్రపత్రిక విలేఖరిగా ఉన్న తను ఆ బ్యాంకు పురోగతికై పలు వార్తా కథనాలు రాసినట్లు సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతిరావు తెలిపారు. ఆపై ప్రధాన కార్యాలయం గుంటూరుకు మారటం.....ఉభయ గోదావరి జిల్లాలు కూడా చేరటంతో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకుగా రూపాంతరం చెందింది.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan